రెడ్డి, నేనూ బస్సు దిగడమేమి వీథులన్నీ పరుగు పరుగున తిరిగాం. ఎదురుగుండా కన్పించే గాలి గోపురం "రా! రండి" అని పిలిస్తున్నట్టుంది. కృష్ణలో తల మునకలుగా స్నానాలు చేశాం. దేవుడి గుడి దర్శించాం. ధ్వజస్తంభం మీద రామచిలకని పలకరించాం. బజార్లోకొచ్చి పప్పుచెక్క కొనుక్కున్నాం. తింటూ ధరణికోట నడిచివెళ్ళి వూరు చుట్టూతా వున్న కోటదిబ్బ లెగబాకాం.

అప్పటికి మిట్టమధ్యాహ్నమయింది.

అలిసిపోయాం. మొదట్నించీ చూస్తున్నాను రెడ్డి పెద్ద స్థాణువులాంటివాడు. నా బలవంతాన బయలుదేరి అమరావతి వచ్చాడేతప్ప ఈ మట్టిలో, ఈ గాలిలో తిరుగుతుంటే అతనిలో ఏ స్పందనా లేదు.

"ఇక తిరిగిపోదామోయ్" అన్నాడు రెడ్డి.

'బౌద్ధ శిల్పాలు చూడొద్దా!" అన్నాను.

'అమ్మ' అన్నట్టు నెత్తిన చేతులు పెట్టుకుని "తప్పేదేముంది పద" అన్నాడు.

దీపాల దిన్నెవైపు నడిచాం. పెద్ద దిబ్బ! స్థూపాకారంగా వున్న మట్టి పర్వతం. నాకేమో దానిపైన

## అమరావతి కథలు

సత్యం శంకరమంచి

అనేక వందల, వేల దీపాలు మిణుకుమిణుకుమని వెలుగుతున్నట్టు, కొందరు వేల బౌద్ధ భిక్షకులు కాషాయాంబరాలతో బుద్ధుని గురించి కీర్తిస్తున్నట్టు ఆ పైన సామూహికంగా మౌన ప్రార్థనలు చేస్తున్నట్టు అనిపిస్తోంది. రెడ్డి గులకరాళ్ళు, ఎర్రమన్ను చేత్తో తీసుకొని అటూ, ఇటూ విసుర్తూ విసుగ్గా తిరుగుతున్నాడు.

"ఇక శిల్పాలు చూద్దాం పద ..." అని తొందర పెట్టాడు. లేకపోతే అంత ఎండలో ఆ దీపాల దిన్నె మీద కూర్చుండిపోతానేమోనని అతని భయం ... శిల్పాలు చూపి తిరిగొచ్చాం. "ఎలా వుంది మ్యూజియం" అన్నాను.

'బొమ్మలు బాగానే చెక్కారు' అన్నాడు రెడ్డి పరమ సామాన్యంగా.

నాకు కడుపు చెరువయిపోయింది. గట్టిగా నెత్తిమీద కొడ్దామనుకున్నాను. ఎంత చెడ్డా స్నేహితుడు. 'రెడ్డీ! నువ్వు పెద్ద బండరాయివయ్యా. నిన్ను శిల్పంగా మలచగలవాడెవడో తెలియడం లేదయ్యా' అనుకుని లేవబోతుంటే మ్యూజియం క్యూరేటర్ వచ్చాడు. నేను గబగబా ఆయన దగ్గరకు పరుగెత్తుకెళ్ళి "అయ్యా స్థూపం కింద వున్న బుద్ధుడి అస్థికలు ఈమధ్య దొరికాయుటగా. వాటిని చూపిస్తారా" అనడిగాను.



సాక్షాత్కారం

క్యూరేటర్ ఒక్క క్షణం ఆలోచించి 'రండి' అన్నాడు.

నేను పరుగున వచ్చి మెట్ల మీద కూర్చున్న రెడ్డిని లేపి, "బుద్ధుడి పవిత్రాస్థికలు చూపిస్తారట రా!" అన్నాను. రెడ్డి విసుక్కుంటూ లేచి వచ్చాడు. క్యూరేటర్ గదిలో మేం ముగ్గురం. పరమ నిశ్శబ్దంగా వుంది. నాకు ఉద్వేగంతో చెమటలు పోస్తున్నాయి. 'ఏ అస్థికల పైన ఇంతటి మహాస్థూప నిర్మాణం జరిగిందో ఆ అస్థికల్ని దర్శించబోతున్నాను. కొన్ని శతాబ్దాల పాటు కొన్ని కోట్లాది ప్రజలు పూజించుకున్న తథాగతుని శరీరావశేషాలను చూడబోతున్నాను.'

క్యూరేటర్ లేచాడు. బీరువా తాళం తీసి తలుపులు తెరిచి, సీలున్న కవరు తీసి అందులోంచి మరో తాళాలు తీశాడు. ఆ తాళాలతో ఇనప్పెట్టె తెరిచాడు. అందులోంచి మరో మంచి గంధం చెక్కతో చేసిన పెట్టె బైటికి తీశాడు. ఆ పెట్టె తీస్తున్నప్పుడు అతని ముఖం కళవళ పడుతోంది. దాన్ని దాచుకుందుకు కాబోలు "నేనీ పెట్టె తీస్తున్నప్పుడల్లా బుద్ధుణ్ణి ప్రార్థిస్తాను. భగవాన్ మళ్ళీ క్షేమంగా ఈ ఇనప్పెట్టెలోకే వెళ్ళిపో! అని" అంటూ ఆ గంధపు చెక్క పెట్టెని టేబుల్ మీదకి తీసుకొచ్చాడు. టేబుల్ మీద ఓ ముఖమల్ గుడ్డ పరిచాడు. అప్పుడు ఆ గంధపు పెట్టె తెరిస్తే, అందులో ఐదు స్ఫటికలతో చేసిన భరిణెలు. ఆ భరిణెల్లో బుద్ధిడి అస్థికలు. ఒక్కొక్క భరిణే తెరిచాడు. ఒక భరిణెలో బుద్ధుడు ఎముక, దానికి తోడుగా బంగారు పూలు, రత్నాలు. వాటిని శానంతో ఎత్తి చూపిస్తున్నాడు. రెండో భరిణెలో మళ్ళీ బుద్ధుడి ఎముక, చుట్టూ మంచి ముత్యాలు. మూడో భరిణెలో బుద్ధుడి ఎముక, బంగారు పూలు. నాలుగో భరిణెలో బుద్ధుడి ఎముక, పగడాలు. ఐదో భరిణెలో భిక్షాపాత్ర ముక్కలు, బంగారు పూలు.

భరిణెలు స్థూపాకృతిలో వున్నాయి.

నాకు ఒళ్ళు జలదరించింది.

"కోటి కోట్ల ప్రణతులందుకున్న భగవాన్ నువ్విక్కడున్నావా?"

## ముత్యాలవాన

"అయ్యా! నేను ఆ అస్థికల్ని ఒక్కసారి తాకవచ్చునా?" అనడిగాను.

క్యూరేటర్ తటపటాయించాడు. 'ఈ శానంతో ముట్టుకోండి' అన్నాడు.

శానంతో ముట్టుకున్నాను.

నా వొళ్ళు జలదరించింది.

బుద్ధుడి పాదాలు తాకినట్టయింది.

బుద్ధుడి కళ్ళ వెలుగులో కరిగిపోతున్నట్లనిపించింది.

బుద్ధుడు నా తల మీద ఆశీర్వదించినట్టనిపించింది.

కళ్ళంట నీళ్ళు! కరిగిపోతున్న గుండె!

క్యూరేటర్ నా చేతిలోంచి శానం తీసికొని, పెట్టె మూసి భద్రంగా ఆ పెట్టెని ఇనప్పెట్టెలో దాచేశాడు.

కృతజ్ఞతల తర్వాత రెడ్డి, నేనూ తిరిగొస్తున్నాం. రెడ్డిలో ఏ చలనమూ లేదు.

నేనూ మాట్లాడదలుచుకోలేదు.

ఉన్నట్టుండి రెడ్డే అడిగాడు "ఆ ఎముకల విలువ ఎంతంటావ్?" అని.

రెడ్డి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాను "ఆ పవిత్రాస్థికల విలువ సూర్యచంద్రులంత."

రెడ్డి కళ్ళు వెలిగాయి.

## చెవిలో పువ్వులు

